కిన్నెరసాని పాటలు

విశ్వనాథ సత్యనారాయణ

కిన్నెరసాని పాటలు

విశ్వనాథ సత్యనారాయణ

కిన్నెరసాని పాటలు

విశ్వనాథ సత్యనారాయణ

1. కల్పన

కిన్నెర మహాపతివ్రత. అందరు తెలుగుకన్నెలకు మల్లేనే ఉద్విగ్నహృదయ. ఎక్కువ తెలుగుకుటుంబాలకు సామాన్యమైన అత్తాకోడళ్ళ పోరాటం ఆ యింట్లోనూ వెలిసింది. కొడుకు సుఖమెరుగని అత్తకు కిన్నెరమీద నిందలారోపించడం పని అయింది. ఒకప్పుడు ఆవిడ చేసిన నింద భరించడం కష్టమైంది. కిన్నెరహృదయం శోకంచేత ప్రళయసముద్రం అయింది. కిన్నెర భర్త ఏంచేస్తాడు? తల్లిని కాదనాలేడు, భార్యను ఓదార్చుకోనూలేడు. ఆవేశహృదయంతో కిన్నెర అడవులవెంట పరుగెత్తింది. భర్తపోయి ఆమెను వద్దని కౌగిలించుకున్నాడు. ఆమె అతని కౌగిట్లో నే కలిగి నీరై వాగై ప్రవహించింది. అతడు శోకించి శోకించి శిల అయినాడు.

వనములను దాటి 'వెన్నెల బయలు' దాటి
తోగులను దాటి దుర్గమాద్రులను దాటి
పులుల యడుగుల నడుగులు కలుపుకొనుచు
'రాళ్ళ వాగు' దాటి పథాంతరములు దాటి
అచట కిన్నెరసాని -
నా యాత్మయందు
నిప్పటికి దాని సంగీతమే నదించు ...

2. కిన్నెర పుట్టుక

ఓహో కిన్నెరసానీ
ఓహో కిన్నెరసానీ
ఊహామాత్రము లోపల
నేల నిలువవే జవరాలా

కరగిపోతి నిలువెల్లను
తరలించితి నా జీవము
మరిగిపోయి నా గుండియ
సురిగిపోయెనే ప్రియురాలా ఓహో...

తనయెడ తప్పేయున్నది
అనుకొనవే నాథునిదెస
వనితలు నీకలె కఠినలు
కనిపించరువే యెందును ఓహో...

ఇంత కోప మేమిటికే
యింత పంత మేమిటికే
ఇంతులు జగమున పతులకు
నింతులు సేయుదురటవే ఓహో...

ఇప్పుడెగదె నా కౌగిట
కప్పితి నీ శోకమూర్తి
అప్పుడె నిలువున నీరై
యెప్పుడు ప్రవహించితివే ఓహో...

అంత పగే పూనితివో
అంత కోప మొందితివో
ఇంతీ నను శిక్షింపగ
నింకొక మార్గము లేదటె ఓహో...

రాలపైన తొలినాళుల
కాలిడగా నోర్వలేవు
రాలను కొండల గుట్టల
నేలా ప్రవహించెదవో ఓహో...

నీవు మహాపతిశీలవు
కావని నేనంటినటే

అటు లంటిన నాకంఠము
కటారి త్రెంచకపోతిన ఓహో...

వెన్నెలవలె తెల్లని నీ
సన్నని మేనిపసందులు
కన్నులకును కనిపించెను
చిన్ని తరగ చాలువోలె ఓహో...

నీ యొయ్యారపు నడకలు
మాయురె కనిపించెను పో
మలకలుగా ప్రవహించిన
సెలయేటి భవన్మూర్తిని ఓహో...

నీ నవ్వులు నురుగులుగా
నీ వళులవి తరగలుగా
నీ కన్నులు మీనులుగా
నీ కరణిని ప్రవహించెదు ఓహో...

నీ జఘనము నిసుకతిన్నె
గా జూచిన నాకన్నులు
ఊడిపడవు నేలపైన
నురిసిపోవు లోనె లోనె ఓహో...

మున్ను భగీరథ భూపతి
వెన్ను వెంట పరుగెత్తిన
అన్నాకధునీ వైఖరి
నున్నది నీ చన్నత్రోవ ఓహో...

పరుగెత్తెడు నీ వేణీ
బంధము పూనితి చేతను
కరమున వేణికి బదులుగ
కాల్వగట్టె నీటిపొరలు ఓహో...

ఎడమచేత నీకొంగును
ఒడిచిపట్టుకొంటి చెలీ
తడిచేతను కొంగులేక
తడబడితిని ప్రియురాలా ఓహో...

నీపాదమ్ములు మోచిన
నా ఫాలమ్మున చెమ్మట

ఈ పగిదిని వాగువైన
నీపై ప్రేమము చూపెడి ఓహో...

నీవే నా జీవితమణి
వీవే నాజీవే శ్వరి
వీవే నా చూడామణి
వీవేనే ప్రియురాలా ఓహో...

నీవే యిట్లైతివిపో
జీవము లుండునె నామై
నీవలె నేను ప్రవాహం
బై వచ్చెద రానీవే ఓహో..

ఈవు రసాకృతి వగుటను
ఈ వైఖరి ప్రవహించితి
నేను శిలాహృదయుండను
పూనుదునె ధునీవైఖరి ఓహో...

మునుపే నీకన్నులు గని
యనుకొంటిని నీవు నదీ
వనితవు మానుషజన్మము
కనినా వని మనసులోన ఓహో...

ఈ తరగల కదలికలో
ఓ తరుణీ నీ కంఠ
శ్రీ తారుణ్యము తోచగ
పోతివటే పరుగులెత్తి ఓహో...

నిను కౌగిట నదిమిన నా
తనువుపులక లణగలేదు
కను విప్పితినో లేదో
నిను కానగ లేనైతిని ఓహో...

ఈ దురదృష్టుడ నే మని
రోదించెద నడవులందు
నీదే నీదే తప్పని
వాదించిన వడవు లెల్ల ఓహో...

ఇదిగో చేతులను చాచితి
నేడ్చుచుంటి కంఠ మెత్తి

ముదితా వినిపించుకొనక
పోతివటే ప్రియురాలా ఓహో...

నీకై యేడిచి యేడిచి
నాకంఠము సన్నవడియె
నా కన్నులు మందగించె
నా కాయము కొయ్యబారె ఓహో..

ఈ యేడుపు రొదలోపల
నా యొడలే నే నెఱుగను
నా యీ దేహ మిదేమో
జాయివోలె నగుచున్నది ఓహో...

3. కిన్నెర నడకలు

కరిగింది కరిగింది
కరిగింది కరిగింది
కరిగి కిన్నెరసాని వరదలై పారింది
తరుణి కిన్నెరసాని తరకల్లు కట్టింది
పడతి కిన్నెరసాని పరుగుల్లు పెట్టింది

కదిలింది కదిలింది
కదిలింది కదిదింది
కదిలి కిన్నెరసాని వొదుగుల్లుపోయింది
సుదతి కిన్నెరసాని సుళ్ళుగా తిరిగింది
ముదిత కిన్నెరసాని నురుసుల్లు గ్రక్కింది

నడచింది కడరాళ్ళ
గడచింది పచ్చికల్
తడసి కిన్నెరసాని సుడులలో మొరసింది
జడిసి కిన్నెరసాని కడలందు వొరిసింది
సుడిసి కిన్నెరసాని జడలుగా కట్టింది

కరగగా కరగగా
కాంత కిన్నెరసాని
తరగచాలుల మధ్య తళతళా మెరిసింది
నురుసుపిండులతోడ బిరబిరా నడిచింది
ఇసుక నేలలపైన బుసబుసా పొంగింది

కదలగా కదలగా
కాంత కిన్నెరసాని
పదువుకట్టిన లేళ్ళకదుపులా తోచింది
కదలు తెల్లని పూలనదివోలె కదిలింది
వదలు తెల్లనిత్రాచు పడగలా విరిసింది

నడవగా నడవగా
నాతి కిన్నెరసాని
తొడిమ యూడిన పూవు పడతిగా తోచింది
కడుసిగ్గుపడు రాచకన్నెలా తోచింది
బెడగుబోయిన రత్న పేటిలా తోచింది

పతి రాయివలె మారి
పడియున్న చోటునే

పడతి కిన్నెరసాని విడలేక తిరిగింది
ముగుద కిన్నెరసాని వగచెంది తిరిగింది
వెలది కిన్నెరసాని గలగలా తిరిగింది

తాను నదిగా నేల
నైనా ననుచు లోన
పూని కిన్నెరసాని పొగిలింది పొగిలింది
ముక్త గీతికవోలె మ్రోగింది మ్రోగింది
ఒకచోట నిలువలే కురికింది వురికింది

ఏ వుపాయము చేత
నైన మళ్ళీ తాను
మనిసి కిన్నెరసాని నగుదామ యనిపించి
ఆపలేనంత కోరికచేత విలపించి
ముగుద కిన్నెరసాని మొరసింది మొరసింది

తను వీడితే వోర్చు
కొనలేడు కాబోలు
బ్రతికుండగా యింత ప్రణయమ్ము కలదంచు
తెలిసితే యింకెంత చెలిమివుండేదంచు
తలపోసి తలపోసి సొలసె కిన్నెరసాని

అటువంటి పతితోడి
అటువంటి కాపురం
బిటు చేసికొంటినం చెక్కడా లేనంత
వగచెంది వగచెంది వనిత కిన్నెరసాని
వనరింది వనరింది వనిత కిన్నెరసాని

తుదకేమి చేయగా
నెదవోక అలవోక
పతి రాయిగా మారి పడియున్న గుట్టపై
అతివ తన కెరటాల హస్తాలతో చుట్టి
వెతపొంది వెతపొంది బిట్టు ఘోషించింది

మాటి మాటికి కొండ
మాద్రిగా పడివున్న
తన నీటుకాణ్ణి చేతుల కౌగిలిస్తుంది
పలకవా యని మ్రోతపడి పల్కరిస్తుంది
పతిగుట్టపై తాను వ్రాలి యేడుస్తుంది

ఓనాథ ఓనాథ
ఓనాథ ఓనాథ
నాకుమల్లే నీవు నదివోలె పారరా
జలముగా యిద్దరము కలిసి పోదాముర
కెరటాలు కెరటాలు కౌగిలిద్దాముర

ఓనాథ ఓనాథ
ఓనాథ ఓనాథ
నీయందు తప్పింక నేను చెయ్యను లేర
ఆనపెట్టితి వేని అడుగుదాటను లేర
ఇక జన్మలో కోపమింత పొందను లేర

రారా ఓహో నాథ
రారా ఓహో నాథ
వెలది నీ కిన్నెరా కలగిపోయిందిరా
నాతి నీ కిన్నెరా నలగిపోయిందిరా
పడతి నీ కిన్నెరా బడలిపోయిందిరా

ఓనాథ నీయందు
నేను చేసిన తప్పు
తిరిగి యెప్పటికైన తీర్చుకుంటానురా
నీత్రోవ నీదిరా నాత్రోవ నాదిరా
మరల నాతో నీవు మాటాడబోవురా

పిలిచింది పిలిచింది
పిలిచింది పిలిచింది
పిలిచి కిన్నెరసాని పిలుచు టాపేసింది
బడలి కిన్నెరసాని పడిపోయినట్లైంది
తరుణి కిన్నెరసాని కెరటాలు తగ్గింది

వనరింది వనరింది
వనరి కిన్నెరసాని
మండియారిన నిప్పుమాద్రిగా నారింది
తనకర్మ మింతియేయని లోన ననుకుంది
తన కింక పతితోడి తగులు లేదనుకుంది

చేతులారా తాను
చేసుకున్నా నాని
యింతి కిన్నెరసాని యేడ్చినా యేడ్పులూ

సుదతి కిన్నెరసాని చూపినా దుఃఖమూ
అవికూడ జలములై ఆమెలో కలిసినై

నీలిమబ్బుల బోలు
నిడివి నీ చేతుల్లు
నన్నింక కౌగిలించగరావు కాబోలు
కడుప్రేమతో చేరగా తీవు కాబోలు
నెమ్మదిగ నా యొడల్ నిమురవు కాబోలు

నేను కోపము నంది
నీ ప్రక్కనుండగా
వలదన్నకొద్ది నాపదము లొత్తుచు నీవు
తెలచి కౌగింటిలో తేర్చుకుంటూ నీవు
నాజొమ్ము తలచేర్చగా రావు కాబోలు

తలిరాకువంటి మె
త్తని యెఱ్ఱి పెదవితో
తార్చి నా మోము నద్దగరావు కాబోలు
నా యొడల్ మివుల నందపుకుప్ప యని చెప్పి
ఎల్ల తావులను ముద్దిడరావు కాబోలు

అని సన్న గొంతుతో
వనరి కిన్నెరసాని
రొద యడంగిన పావురాయి గొంతుకవోలె
తనలోన తానేమొ మెలమెల్ల రొదచేసి
కొనుచు పల్లపు నేలకును డిగ్గి పడిపోయె

జలదేవతలు వచ్చి
నెలత కిన్నెరసాని
పదమంచు పదమంచు బలవంతపెట్టంగ
మరిమరీ పతిచుట్టు తిరిగి కిన్నెరసాని
వలవలా యేడ్చింది పలపలా కుందింది

జలదేవతలు వచ్చి
చలపెట్ట పతిగుట్ట
విడలేక విడలేక పడతి కిన్నెరసాని
చనలేక చనలేక చాన కిన్నెరసాని
పోలేక పోలేక బాల కిన్నెరసాని

జలదేవతలు వచ్చి
చలపెట్ట పతిగుట్ట

వదలగా లేక యా ముదిత కిన్నెరసాని
తల్లి దగ్గరనుండి తనమెడకు పలుపోసి
లాగగా బడ్డట్టి లేగలా సాగింది

సాగింది సాగింది
జాలుగా పారింది
ఆవు పొదుగున పాలు ధారకట్టిన యట్లు
వనదేవతలు నీళ్ళు వొలకబోసినయట్లు
తల్లి చల్లని ప్రేమ వెల్లివారినయట్లు

జాలుగా పారింది
జలజలా పొంగింది
లేతయెండలు దిశాళిని క్రమ్ముకొన్నట్లు
పాలాట్రగడము పాతర తీసికొన్నట్లు
ముద్దరాలిమనస్సుపొంగి వచ్చినయట్లు

జలజలా పొంగింది
బిలబిలా నడచింది
పరికిణీ తొక్కాడు పదియేండ్ల కన్యలా
చిన్నిగంతులువేయు తెల్లనాఁబెయ్యలా
పసిపాప సెలవి వారిన బోసినవ్వులా

నడిచింది నిడచింది
నడిచి కిన్నెరసాని
నడిచి యందాలు చందాలుగా నడిచింది
గడియలోపల పెద్దకాల్వగా కట్టింది
అడవితోగుల రాణి యన్నట్లు తోచింది

ఏమి కిన్నెరసాని
ఏమి కిన్నెరతోగు
బంగారుతీగలో పానకమ్మైపోయె
కొబ్బరిపాలు వాకలు కట్టినట్లయ్యె
వెయ్యావులొకసారి పిదికినట్లైపోయె

జలదేవతల వెంట
సాగి కిన్నెరసాని
తెలితారకల వెంట వెలుగులా తోచింది
తలిరుపూవుల వెంట తావిలా తోచింది
తెనుగుపాటల వెంట తీపిలా తోచింది

వొయ్యారి నడలతో
వచ్చు కిన్నెరసాని
వనదేవతలు పూలు పై క్రుమ్మరించారు
భూదేవతలు ఎదురుపోయి దీవించారు
వాయుదేవతలు రమ్మని పాటపాడారు

పాఱు కిన్నెరసాని
పజ్జలందున నిల్చి
కోకిలా తన గొంతుకొన విచ్చి పాడింది
పికిలిపిట్టలు మేలిరకముగా కూసినై
తెలుగుపిట్టలు వొళ్ళుతెలియక పాడినై

ఎంతదూరముపోయె
నంతదూరముదాక
తెఱవ కిన్నెర వెన్కతిరిగి చూచుచె పోయె
పడతి కిన్నెర తిరిగి పతిని చూచుచె పోయె
నాతి కిన్నెర తిరిగి నాథు చూచుచె పోయె

పతివంక చూచుచూ
పడతి కిన్నెరసాని
పోయేటివేళలో భూమి తనంతగా
తోరమై విరియుచూ త్రోవగా చేసింది
కెరటాలతో చొచ్చుకోదు కిన్నెరసాని

బ్రతికి వున్నప్పుడూ
అతివ కిన్నెరసాని
ఎంత ఒయ్యారియో ఎంత నెమ్మదిచానో
అంత ఒయ్యారమ్ము అడుగడుగుపోయింది
అంత యిల్లాలి నెమ్మదితనము చూపింది

4. కిన్నెర నృత్యము

కెరటాలలో నుర్వు
తెర చాలులో నీటి
పొరజాలులో కిన్నె
రటు కదలి యిటు కదలి
చిటితరంగాలతో పొటితరంగాలతో
నటనాలు మొదలెట్టెనే క్రొన్నీటి
తుటుములా కదలాడెనే

పువుకన్నెలా జగా
రవ నవ్వులా వేల్పు
కవ చివ్వలా కిన్నె
రటు లూగి యిటు లూగి
చిటిలు కెరటాలతో పెటిలు కెరటాలతో
జవ్వుజవ్వన నూగెనే తెలిమల్లె
పువ్వురువ్వులు పోయెనే

చిఱుగాలిలో నూగు
కొఱవంపుతో నీటు
తలితీపులో కిన్నె
రటు లేచి యిటు లేచి
జల్లుతుంపురులతో కొల్లతుంపురులతో
మెల్ల మెల్లన నాడెనే కెరటాల
జల్లులో ముంచెత్తెనే

నడినీటిలో మేలి
జడసందులో నీటి
ముడిపొందులో కిన్నె
రటు పొంగి యిటు పొంగి
రంగారు నలలతో పొంగారు నలలతో
చెంగు చెంగున దూకెనే క్రొంగ్రొత్త
సింగారములు వొలికెనే

సురగాలిలో పొంగు
తరగాలిలో నీటి
తెరడాలులో కిన్నె
రటు పొరలి యిటు పొరలి
పరుగెత్తు నురుగుతో దరులొత్తు నురుగుతో

గల్లుగల్లున మ్రోగెనే జల్లు మని
వెల్లువల్ విరజిమ్మెనే

సొనజారుతూ నీటి
పనవాలుతూ అండ
మున సోలుతూ కిన్నె
రటు చెదరి యిటు చెదరి
చిన్నారి నడలతో పొన్నారి నడలతో
వన్నె వన్నెలు పోయెనే కిన్నెరా
క్రొన్నెలా తళు కొప్పెనే

చిఱు తేనెలా అచ్చ
రల గొంతులా గజ్జి
యల మ్రోతలా కిన్నె
రటు మొరసి యిటు మొరసి
గలగలారవళితో జలజలారవళితో
మెల్లగా నూగాడెనే కెరటాల
జల్లుగా ముసురెత్తెనే

తెగ పాడుతూ అంద
ముగ నాడుతూ తేనె
వగలోడుతూ కిన్నె
రటు వాలి యిటు వాలి
తళుకు వాకలతోడ బెళుకువాకలతోడ
మలకలై నటియించెనే తెలినీటి
పులకలై బుగ్గెత్తెనే

లయ పెంచుతూ మధ్య
లయ దించుతూ పాట
రయ మెంచుతూ కిన్నె
రటు సోలి యిటు సోలి
తెలి నీటిమేనితో తలిరాకు మేనితో
ఒయ్యారములు పోయెనే కిన్నెరా
అయ్యారె యనిపించెనే

ధణధంగిణాం దధోం
గిణ తక్కిణాం మద్దె
లల మ్రోతలై కిన్నె
రటు మ్రోగి యిటు మ్రోగి
చిఱు లొల్గుసోనలై సిరులొల్కు సోనలై

మృదు తాండవము చేసెనే వనవీథి
పదువు పాయలు కట్టెనే

ఘలు ఘల్లునా వెల్లు
వల పెల్లునా కొల్ల
వలి జల్లునా కిన్నె
రటు త్రొక్కి యిటు త్రొక్కి
గిలుకు టందియలునా తళుకు టందియలునా
అలల నురుసులు తోచెనే ఆమధ్య
జలజలా పొంగెత్తెనే

జిగి బెళ్కులా ధగా
ధగ తళ్కులా జగా
జిగికుల్కులా కిన్నె
రటు నవ్వి యిటు నవ్వి
అలల పెన్నురుసుతో సెలల పెన్నురుసుతో
తెలుగు వాదుగులు పోయెనే కిన్నెరా
తెలుగు తీపులు చిమ్మెనే

తెలి నుర్వులో చెమ్మ
టలు చిమ్ముతూ అలస
టలు క్రమ్ముతూ కిన్నె
రటు సొక్కి యిటు సొక్కి
చిఱుమీను కనులతో శ్రమ మీను కనులతో
సొగతనములు వోయెనే లోగొంతు
రాగాలు వెలయించెనే

తమికోనలో మిటా
రము క్రక్కుతూ నిగా
రము లొల్కుతూ కిన్నె
రటు లెగిరి యిటు లెగిరి
ననమేని వంపుతో నును మేని ముంపుతో
కాలిగజ్జెలు మ్రోగెనే జల్లు మని
క్రాలు కెరటాల్ చిందెనే

అల కోనలో మంచు
వలి సోనలో వెల్లు
వల వానలో కిన్నె
రటు లోడి యిటు లోడి
రస మేలు రూపుతో పసమేలు రూపుతో

సొగసు వంపులు వంగెనే వెన్నెలా
చిగురు మంపులు సూపెనే

తలి రోర్పుతో నీటి
యలలూర్పుతో అంద
ముల మార్పుతో కిన్నె
రటు తూగి యిటు తూగి
బిగువు టందాలతో నగవు టందాలతో
నిండుగా ప్రవహించెనే పువ్వుల్ల
చెండులా చెలు వొలికినే

చిఱురాలపై మిఱ్ఱు
లగు నేలపై మెట్ట
లగు చేలపై కిన్నె
రటు దూకి యిటు దూకి
గ్రక్కదలు నీటితో చిక్కువడు నీటితో
నీటి గుబురులు కట్టెనే విరిపూల
తోటలా తళు కొత్తెనే

తెర పొర్లుతో యీగి
కొను మర్లుతో తిర్గి
పడు దొర్లుతో కిన్నె
రటు తరలి యిటు తరలి
పావురా యెలుగుతో తీవలా యెలుగుతో
ఒత్తుకొని తరగొప్పెనే తరగల్లు
ఒత్తిల్లి తట మొత్తెనే

అడవిలో చిఱుపాయ
లై నాకలై సోన
లై జాలులై కిన్నె
రటు ప్రాకి యిటు ప్రాకి
దివ్య నృత్యములతో దివ్యనిస్వనముతో
దిగ్దిగంతము లంటెనే సురనదీ
దీప్తి దిక్కుల చిమ్మెనే

జిలుగు టందియలతో
కులుకు క్రొన్నడలతో
వెలది కిన్నెరసాని
పలుత్రోవలుగ బోయి
తెలిపూల తేనెవాకలు వారగాచేసి

తెనుగు వాగై పారెనే నెత్తావి
తెనుగు పాటలు పాడెనే.

5. కిన్నెర సంగీతము

కోనలన్నీ ముంచుకొనివచ్చు సెలయేటి
చాన కిన్నెరసాని జలజలా స్రవియించు
తరగలో పై కెగయు
నురుగులో క్రొంగ్రొత్త
తేనెకాలువ లూరెనో అమృతంపు
వాన చినుకులు జారెనో

తేనె తరగల పిండుతోన జలజల సాగు
చాన కిన్నెరసాని జాలైన మేలైన
వాకలో అందాల
రాకలో బంగారు
జిలుగు గంటలు మ్రోగెనో చిన్నారి
బిగువు నవ్వుల సాగెనో

తేనెలై కలకండ సోనలై వానలై
చాన కిన్నెర పాట సాగులాడుట చూచి
చివరలో చివురొత్తు
సవురులో క్రొమ్మావి
వింతగా సిగ్గందెనో కోకిలా
గొంతులో కద లాడెనో

చెఱుకుపానక మెట్టి జీరపాకమువోలె
తరుణి కిన్నెరపాట తారులాడుట చూచి
పువ్వులో లేసంజ
రువ్వులో దానిమ్మ
తెల తెల్లనయి పోయెనో క్రొంజిల్క
పలుకులో పస దప్పెనో

ప్రొద్దు కాకల జాలిపోవు మంచును బోలె
పొలతి కిన్నెరపాట పొంగిపోవుట చూచి
నీటిలో కిన్నెరా
పాటలో అడవిలో
తోగుల్లు పారాడెనో క్రొంజలువ
వాగుల్లు సాగాడెనో

పికిలి పిట్టల యీలలకు క్రొత్తపాటిగా
సకియ కిన్నెరపాట జరుగు లాడుట చూచి

సాములో చిఱువెచ్చ
జాములో మెల్లగా
పగలు పులకలు పొందెనో మల్లెలా
సొగసు వెలుగులు చిందెనో

తొలివెన్నెల చివుళ్ళ తెలినిగ్గు విరజిమ్ము
వెలది కిన్నెరపాట విరిసిపోవుట చూచి
తెలుపులో వెన్నెలా
మలుపులో రేచాన
సిరివెల్లి పచరించెనో విరిపూల
నెరతావి తర మెంచెనో

తలిరాకుకన్న మెత్తని యందమును బోవు
తరుణికిన్నెరపాట తాను తాన మందుటచూచి
ఎడదలో ఆనంద
జలధిలో లోకాలు
పులకితమ్మయి పోయెనో రసవార్ధి
చులుకితమ్మయి పోయెనో

చిఱుత తంగేటిజంటి జీబు చిక్కనవోని
చిన్ని కిన్నెరపాట జీరసాగుట చూచి
పూలలో తేనెల్ల
చాలులో క్రొందేంట్లు
కదలు లాడుట మానెనో వాకపై
పదువులై పరువెత్తెనో

ఒకసారి సన్నగా ఒకసారి విన్నగా
ఉవిద కిన్నెరపాట యొయ్యారములు చూచి
కళ్ళలో లేపచ్చ
మళ్ళలో పసిలేళ్ళు
బెదురు చూపులు చూచెనో మైనిగల్
నదరుగా కనుపించెనో

అంచేకన్నియయెల్గు అడవి సాగినయట్లు
అతివ కిన్నెరపాట అతిసన్నగిలి పోవ
పొరలలో సనసన్న
తెరలలో చిఱుగాలి
యాపాట సాగించెనో ఉయ్యాల
తో పాటు వూగించెనో

అందగత్తెల జిల్గుటందె మ్రోసినయట్లు
చింది కిన్నెరపాట జిలుగుల్లు పోవగా
కూతలో లేతమ్మి
మేతలో రాయంచ
లొండొంటి ప్రేమించెనో సింగార
ముండి కలయిక పొందెనో

ఏటి కిన్నెర పాట ఎగిరెగిరి మిన్నంది
సాటి తారల నడుమ చాలుగా నిరవొందు
దవ్వులో జాబిల్లి
నవ్వులో క్రొక్కారు
తలిరు పూవులు చిమ్మెనో చొక్కంపు
తెలుగు వెలుగులు క్రమ్మెనో

కంచు గీసినయట్లు కదలు తరగలతోన
మించి కిన్నెరపాట మేలిపోకలు వోవు
నిగ్గులో అందంపు
జగ్గులో వనమెల్ల
ఒక పాటయై పోయెనో తనుదాన
యెఱుక లేకే పోయెనో

ముద్దు ముద్దుగ నడచి ప్రోడవోలిక నాడి
మురిపమ్ముగా పాడి ముగుద కిన్నెరసాని
యెడదలో యెదురైన
బెడదలో కష్టాల
కడలియే కల గాంచెనో కన్నీటి
కడవలే ప్రవహించెనో.

౬. కడలి పొంగు

గాలిపిల్లలెపోయి వూదెనో
మొగిలు కన్నెలుపోయి చెప్పెనో
తగని కోరికచేత తనలో కడలిరాజు
సొగసు కిన్నెరసాని చూడాలె ననిపించి
ఉబ్బుట్ట లూగెనూ
మిట్టెక్కి చూచెనూ

మిసమిసని మింటికై పొంగెనూ
మసక మసకల కళ్లు విప్పెనూ
ఎంత దూరానుందొ యీ చిన్ని పడుచంచు
సంతోసమే మేను సకలమ్ముగా మారి
మిరిమిర్రి చూచెనూ
బొటవ్రేళ్ళ నిలచెనూ

ఉబికి కెరటా లూగులాడెనూ
గుబురులై ఉప్పొంగిపోయెనూ
తన యొడల్తన కేమొ తెలియ నట్లయిపోయి
తరుణి కిన్నెర అందమే లోక మయిపోయి
సళ పెళా కాగెనూ
గల గలా వూగెనూ

తన నీటిగుణ మెందు పోయెనో
తన చల్లదన మెందు దాగెనో
పరగ తనలో నున్న బడబాగ్ని శిఖ పొంగి
తన శరీరమ్మెల్ల దహియించి నట్లుగా
తటపటయి పోయెనూ
తపియించి పోయెనూ

గంగ తన యిల్లాలు కాదటే
యమున తన యిల్లాలు కాదటే
ఎంతమందీ లేరు ఇన్ని యేళ్ళూ వచ్చి
చిన్ని వాగులు చూచి చిత్త మెరియించుకో
తనకు నిది తగదూ
కడలి రాజనకూ

ఏనాటి ముసలి యీ కడలీ
ఏనాటి పెద్ద యీ కడలీ

తిరిగి నలుగురిలోన తిరుగ నేర్చినవాడు
పరగ కామమునకై బడలిపోయె నటన్న
తన కేమి పరువ్వూ
కడలి రాజనకూ

తన కున్న మరియాద యెంతా
తన కున్న గౌరవం బెంతా
లోకాలు తప్పుత్రోవల పోవునాయేని
సర్ది చెప్పగలట్టి సామంతు డీ రాజ
తానుగా దిగెనా
తప్పుదారులకూ

అన్ని వాగులవంటి దగునా
అన్ని తోగులవంటి దగునా
మంచి కిన్నెరసాని మగని కెక్కినచాన
కొంచెమేమో పొంది కోపమిట్లయినంత
తన్ను పొందునటే
తనకు దక్కునటే

వాగుగా తా నెప్పుడైనదో
తోగుగా తా నెప్పుడైనదో
జలజలా స్రవియించి బిలబిలా ప్రవహించి
కడలి రాజ హారంగు కౌగింటిలో దూరు
టప్పుడె వ్రాసినదీ
అన్ని వాగులకూ

అని పొంగిపోయెనూ కడలీ
అని వూగులాడెనూ కడలీ
తనపైన తారాడు పడవ లల్లలనాడి
వచ్చె నంచు తుఫాను భయ మంది కుందగా
తెరచాప లూగా
కెరటాలు క్రమ్మా

కెరటాలు పొంగినా కడలీ
తరగ లూగాడినా కడలీ
సొగసు కిన్నెరసాని చూ పందుకొనుటకై
గగనమ్ము కొసదాక కెరటాలు వుబికించి
దూరాలు చూచెనూ
బారలూ చాచెనూ

పొంగి పోయిన కడలి చూచీ
మిన్ను ముట్టిన కడలి చూచీ
ఈ అకాలపువేళ యేమో కడలి పొంగి
పోయెబో లోకాలు ముంచి వేయునో అంచు
కళవళం పడెనూ
జగము లన్నీనూ

ఊగులాడిన కడలి చూచీ
ఉబికి పోయిన కడలి చూచీ
ఉప్పు పెనగా వచ్చి ఉర్వి అంతా పొంగి
తెప్పలై నేలపై తేలియాడునో అంచు
కళవళం పడెనూ
జగము లన్నీనూ

అదుగదుగో బాడబము పొంగే
అదుగదుగో నేలపై వచ్చె
అని మానిసులు పిరికితనముగా చెప్పుకొని
మేనిలో ప్రాణాలు బిగియగా పట్టుకొని
కదలిపోవరహో ఒకరొకరి
వదలిపోవరహో

వచ్చె వచ్చెనటన్న కడలీ
ఎంత చూచినను అట్లే నిల్చిపోవగా
ఎంతసేపటికి అట్లే నిల్చి ఉండగా
పిరికితగ్గినదీ
జగము లన్నిటికీ
ఎట్లు పొంగిన దట్లు పొంగీ

ఎట్లు నిల్చిన దట్లు నిల్చీ
ఒకనీటిబొట్టయిన ఉరలి నేలకు రాక
కడలి అచ్చోటనే కదలకుండుట చూచి
పిరికి పోయినదీ
కొంతసేపటికీ
కడలి పొంగిన దంతెకానీ

కడలి ఉబికిన దంతెకానీ
కడలి తా చెలియలికట్ట దాటునె యంచు
కడలిమాత్రము బద్దె గడచిపోవునె యంచు
కడగి యనుకొనిరీ

ఋడుత మానిసులూ
అన్ని విధముల లోక మాడెనూ

అన్ని రీతుల జగము చెప్పెనూ
చిన్ని కిన్నెరసాని చిత్తాన పొగ లెగయు
క్రొన్నిప్పుకలులోన కుమిలించి దహియించు
టెవ్వ రెఱుగుదురూ
నవ్వేటి జనులూ
కడలి మిన్నుల తాకు చూచీ

కడలి తరగల వూగు చూచీ
కడలి తనకోసమై బడలుపడిపోవు నని
కడలి తనపై వలపు కమ్ముకొనివచ్చె నని
కిన్నె రెలిగినదీ
కీడు తలచినదీ
మనసులో పెద్దదిగులుట్టీ

ఎదలోన పెద్దవగ పుట్టీ
కదలిపోయెడి నీరు గడ్డకట్టించుకో
సాగిపోయెడి నీరు సాగ కింకించుకో
బిట్టు కోరినదీ
బిట్టు కుందినదీ
ఓ నాథ నిను వీడి వచ్చీ

ఓ రాజ నిను వదలి వచ్చీ
నా యొడల న్యుతమ్ము నానాజనులు కోర
యీ యేవపుంబ్రతు కేల పొందితినిరా
అంచు వగచినదీ
అంచు లురలినదీ
అచటనే నిలిచిపో నెంచూ

అచటనే ఆగిపో నెంచూ
కాని నీటిగుణమ్ము కదలిపోవునె గాని
చాన కిన్నెరకోర్కె సాగించునే తాను
జలజలా కదలీ
బిలబిలా కదలీ
రాయడ్డముగ చేసి నిలుచూ

పొదలడ్డముగ చేసి యాగూ
ఇంత నిల్చితి నంచు నెంచి లో నుప్పొంగి

పొంత పొంతలరాళ్ళు పొదలు పైపైపొంగి
అడవి పరుగెత్తా
అంతలో నేడ్చా.

7. కిన్నెర దుఃఖము

హా యని కిన్నెర యేడ్చెన్
తన మనోహరుడు శిలయైనా డని
తా నేమో యీ వాగైనా నని
హా యని కిన్నెర యేడ్చెన్

ఊగులాడు కెరటాల నాపుకొన
సాగులాడు తరగల్లు నిల్పుకొన
ప్రాకిపోవు తనగుణము చంపుకొన
చాలక చాలక చాలక చాలక
హా యని

తన తొందరయును తన పతి ప్రేమయు
తాను చేసినా తెలివితక్కువయు
తన పతి చూపిన త్యాగగౌరవము
తలచుకు తలచుకు బోరున బోరున
హా యని

ఏడుపు నిప్పుక లెగసి చిమ్ముకొని
ఏటి నీరముల నెండగట్టుకొని
చేటు తప్పిపోయేటిరీతిగా
బాట యేల కనరాదని రాదని
హా యని

చుక్కనైతె యీ బెడద తప్పునే
మొక్కనైతే యీ వగపు తప్పునే
అక్కట నా చెలువునిదెస చేసిన
యిక్కలుషము నే దాటు టెట్టులని
హా యని

కడలి లోకముల నేలేరాజట
కడలి ధర్మములు నిలిపే దొరయట
కడు పతివ్రతల కవయ నెంచుటలు
కడలికి తగునా తగునా యిట్లని
హా యని

అతడు మంచివాడే యగునేమో
సతి వాగై ప్రవహించిన దం చన
అతనికోసమే అయిన దటంచును

మతి తలపోయుట తప్పెట్లగు నని
హా యని

ఏడ్చి ఏడ్చి జలమెల్ల నెర్రనయి
ఏడ్చి ఏడ్చి తనువెల్ల నల్లనయి
ఏడ్చి ఏడ్చి నురుసుల్లు తెల్లనయి
ఏడ్చి ఏడ్చి నడకల్లు వేగమయి
హా యని

బొట్టు బొట్టు కొక వేయియెదలుగా
తరగ తరగ కొక వేయినోళ్ళుగా
బడలి నీరమే యేడుపుమయమై
కడలిమ్రోత లెక్కుడు భయమిడగా
హా యని

గాలిహొరలలో కదలాడినవో
అడవిచెట్లలో అణగారినవో
వెలుగు దారులను విచ్చిచొచ్చినవో
కిన్నెర ఏడుపు సన్నని యెలుగులు
హా యని

కిన్నెర యేడుపు సన్నని యెలుగులు
విన్న యడవిలో చిన్ని పులుగుగమి
కిన్నెరతో పాటుగ గొంతులలో సన
సన్నని యేడ్పులు జాలు వార్చగా
హా యని

శిలయైన పతిం దెలచిన గాలులు
మెల మెల్లగ తన తరగల నూగగ
చలచల్లన ప్రాణమ్ములు తేరగ
తలచిన కొలంది దుఃఖము పొంగగ
హా యని

క్రొత్తవాగు పరతెంచి వచ్చె నని
క్రొత్తతోగు పరతెంచి వచ్చె నని
క్రొత్త క్రొత్త యాబాలనీరములు
క్రోలగ వచ్చిన పులులు దిగుల్పడ
హా యని

ఎక్క డెక్కడీ మృగములు వచ్చెను
ఎక్క డెక్కడీ పులుగులు వచ్చెను

ఎక్క డెక్కడి గాలులు వచ్చెను
కిన్నెర నోదార్చుటకై పాపము
హా యని

కిన్నెర యేడుపు చూచి పులుగులూ
కిన్నెర దుఃఖము చూచి మృగములూ
కిన్నెర యేడుపు చూచి గాలులూ
ఓదార్చగలే కవియు నేడ్చెనూ
హా యని

చూడవచ్చినా లేడి కిన్నెరా
గాడివారినా యెడదలోపలా
వాడి వాడి లేజివురు వత్తలై
బే డిస కన్నుల నీరము వెట్టగ
హా యని

ఒడ్డునందు కుందేటికూన లవి
చిన్ని చెవులు తెగ నిక్కపొడుచుకొని
ముందుకాళ్ళు లింపొంద నెత్తి యో
దార్చలేక తెల్లతెల్ల వోవగా
హా యని

గూళ్ళలోన తమ పిల్లల వదలెను
మేతకొరకు పోవాలని మానెను
అడవి పులుగులూ లల్లల్ల చేరుకుని
అడవివాగు నోదార్చవచ్చెనూ
హా యని

పికిలి పిట్టలూ అడవి పిచ్చికలు
నీటి పులుగులూ నేలపులుగులూ
తెగగుమికట్టిన తెలుగు పిట్టలం
దొకటి యేడ్చి మఱియొకటి యేడ్వదా
హా యని

కిన్నెర యేడుపు సన్నని యెలుగులు
మిన్ను మన్ను నడి యెడము నెడమునా
చిన్ని వెలుగులో పిన్న గాలిలో
సన్న సన్నగా జాలువారగా
హా యని

చిన్ని కిన్నెరా సన్నని యెలుగులు
పిన్నగాలి కెరటాల చొచ్చునూ
ఎన్నడో వెనుకటి బ్రతుకున మిక్కిలి
విన్నవాటివలె విరవిరబోవును
హా యని

చిన్ని కిన్నెరా సన్నని యెలుగులు
చిన్ని చెట్ల క్రొంజివురు లంటునూ
ఎన్న నందనము గున్న మావులం
దున్న తుమ్మెదలరొదవలె మొరయును
హా యని

పడతి కిన్నెరా ప్రన్నని యెలుగులు
అడవి పచ్చికలయందున ప్రాకును
అడవి పావురా యెడబాటగ్గికి
గుడగుడ గొంతున కూసిన యట్లగు
హా యని

అల్ల నల్ల కిన్నెర యేడుపులవి
వెల్లివిరిసి గోదావరి కెరటము
లల్లలాడు నా నడిమిసందులో
మెల్లగ దూరెను మొదలిడు పోలిక
హా యని

అల్ల నల్ల కిన్నెర యేడుపు లవి
మెల్ల మెల్ల గోదావరి గర్భము
వెల్లిలోన చొరబారి మొత్తుకొని
గొల్లుమనుచు మొరపెట్టుకొన్నయవి
హా యని

గోదావరి యీవార్త విన్నదీ
గోదావరినది గుండె కరగినది
గోదావరినది జాలి పొందినది
గోదావరి కన్నీరు కార్చినది
హా యని

గోదావరినది పొంగి వచ్చినది
గోదావరి తా నభయ మిచ్చినది
గోదావరి కెరటాలు చాచినది

గోదావరి రమ్మన్నది కిన్నెర
హా యాని

కిన్నెర యెదలో పొంగిపోయినది
కిన్నెర యెదలో తాండవించినది
కిన్నెర మఱి కన్నీరు కార్చినది
కిన్నెర తనకత చెప్పుకున్నదీ
హా యని

కిన్నెర తన కెరటాలు తగ్గినది
కిన్నెర తన యూగిసల నాపినది
కిన్నెర గోదావరి కెరటాలకు
చిన్ని యలలు తొ నంది యిచ్చినది
హా యని.

8. గోదావరి సంగమము

గోదావరీదేవి గుండె జలజల లాడి
ఆదగొని మనసు కదలాడీ జాలి
పాదులో పెల్లగిలి పూడీ కిన్నెరా
గేదంగి తెల్ల రేకెత్తు క్రొత్తరగలో
చాదుకొని పెనుతరగ లూగే ఆవాగు
నాదుకొని యామెవగ పాగే

గోదావరీ జాలిగుండె గూడులు కదలి
సాదుకిన్నెర కెదురుపోయీ ఆమె
లోదిగులు తరగ చేదోయీ వారించి
ఆదరముచే నామె నదిమి కౌగిట బూని
ఏదీ నీ మొగము నా తల్లీ అన్నదీ
నీదిగులు నిక మాను చెల్లీ

గోదావరీ పేదగుండె లోతులు కలగి
రాదగ్గరకు రమ్ము తల్లీ ఎంత
సాదువే నా ముద్దు చెల్లీ నీ వెన్ని
రాదగని కష్టాలరాశి మ్రగ్గితి వమ్మ
నీదు పతి శిలరూపు పొందీ నీవేమొ
ఓదె పనవాగుగా చిందీ

గోదావరీ జాలిగుండె ప్రేగులు తడిసి
నీ దుఃఖ మెంతదో తల్లీ నన్ను
నాదరువుగా నమ్ము చెల్లీ నిను చూచి
పేదలై లోకాలు పెద్దలై యేలేటి
జోదులే మతిచెడిరి తల్లీ నీయేడ్పు
రోదసిని నిండినది చెల్లీ

గోదావరీ యెడద కోసలను కోతవడి
రా దగ్గరకు రమ్ము తల్లీ కడలి
జోదింక నిను కనడు చెల్లీ నాతల్లి
నాదు గర్భమున నిన్నాదుకుని ఉంటాను
నీదు నెగులును పోవ చూడూ కడలి
నీదు జోలికి నింక రాడూ

గోదావరీదేవి కొస మనసులో నొరసి
ఏది నీయొడలు నాతల్లీ చేర్చు

నాదు కౌగింటిలో చెల్లీ తల్లి నీ
లేదలిరు కెరటాలు నాదుకాల్వల నింతు
నీదు బొట్టును కడలి కనడూ నాతల్లి
నీదు సంగతి కడలి వినడూ

గోదావరీ మహాకూలంకషామృత
శ్రీదివ్యమధుతరంగాలూ చిన్న
సాదు కిన్నెర తరంగాలూ కలసికొని
ప్రోదిగొను గంగా సరస్వతుల నీరములు
చాదుకొను తళుకు లురపించే చూడగా
సైదోడుతనము మెరిపించే

గోదావరీ దేవి కొస తళుకు ముత్తెముల
మాదిరి సెలంగు కెరటాలూ చిన్ని
సాదుకిన్నెర తరంగాలూ కలసికొని
లేదళుకు వెన్నెలలలో తలిరుమల్లికల
మూదలించిన యట్లు వొలచే అవ్వాని
పాదలించిన యట్లు వలచే

గోదావరీ దేవి కోరగించే మొగలి
వాదర హూరంగు కెరటాలూ చిన్ని
సాదు కిన్నెర తరంగాలూ కలసికొని
గోదుమలవన్నె తెలిక్రొత్త మబ్బుల జంట
ఊది కలిసినయట్లు పొలిచే అందాల
గాదిలి కవుంగిళులు మలచే

గోదావరీ దేవి కోలుమసగే నన్న
నాదు సేసే తరంగాలూ చిన్ని
సాదుకిన్నెర తరంగాలూ కలసికొని
వీదిలో పెద్దక్క పిన్నక్క నవ్వుల్ల
బోదె లొదిగినయట్లు పొలిచే రతనాల
బాదు లుంచిన యట్లు పొలిచే

గోదావరీదేవి గునిసియాడే మీను
లీదులాడే తరంగాలూ చిన్ని
సాదుకిన్నెర తరంగాలూ కలసికొని
మీది ఉయ్యాలలో మిసమిసను పసిపాప
మాదిరిగ కలసికొని వొలిచే నునుకాంతి
మేదురములై వెలుగు మెలిచే

గోదావరీదేవి కోరి కిన్నెరసాని
సాది తనలో కలుపుకొనెనూ నీటి
పాదులో గ్రుచ్చెత్తుకొనెనూ ప్రేమతో
నాదేవి యాచాన మోదాన కెరటాలు
సాదు నీరము కూడుకొనిరీ కోమలాం
భోదములవలె మొరసుకొనిరీ

గోదావరీ దేవి కోరి కిన్నెరసాని
సాది తనలో కల్పుకోగా కడలి
పాదుకోరిక పెల్లగిలగా కోపాన
ఆదేవి నదలించ నాలోచనము చేయు
కాదంచు మదిలోన నెంచూ మనసులో
వాదించు రంగు చెడు నంచూ

గోదావరీదేవి గొప్ప వంశపురాణి
కాదనేందుకు వీలులేదూ ఆమె
కాదన్నపని జేయరాదూ అందులో
ఏది తనదెస న్యాయ మేదారి నాదేవి
కాదన్నపని మంచిదనునూ లోకాలు
వాదించితే మెప్పు గనునూ

గోదావరీదేవి గొప్పగుణముల చాన
వాదుపొందేపనుల రాదూ న్యాయ
మేదారి విడి యెందు పోదూ అందులో
ఆదేవి మున్ను సీతారాము లోకరొకరి
నేదుకొను నెడబాటు నెరుగూ పరుల క
ష్టాదులకు మదిలోన మరుగూ

గోదావరీదేవి కోరి కిన్నెరసాని
సాది తనలో కలుపుకొన్నా కడలి
యేది చేయగలేక యున్నా అందరూ
ఓ దొరా నీకిట్టు లీదిగులు కాదయా
కాదు పతిభక్తలను కోరా ఆవాగు
పేదరా లది నీకు మేరా

గోదావరీదేవి కొను సప్తఋషుల బి
డ్డౌ దివాహిని తప్పుకోదూ తప్పు
నేదునే గాని కైకోదూ నీవు సి
గ్గేది కోపింతువా యేమొగముపెట్టుకొని

పోదు వాదెవికడ కింకా ఏరీతి
నాదేవికొఱ మాన్తువింకా

గోదావరీదేవి కూడి కిన్నెరసాని
సైదోడుగా మారినంతా కోర్కె
కేదారి మాయ మయినంతా తనపొంగు
మై దించుకొని కడలి లో దించుకొని కడలి
మీది పొంగు కుదించుకొనెనూ లోలోన
నాదుగా తెగ మొరసికొనెనూ

గోదావరీ నీరు కూడి కిన్నెర నీరు
ఏది యేదో తెలియనంతా కోర్కె
కేదారి మాయమయినంతా తొల్లింటి
సాదురూపము పొంది సాగి చెలియలికట్ట
కేదో మెలమెల్లగా చెప్పూ పడవలకు
పో దారిగా నీర మొప్పూ

గోదావరీదేవి కూడి కిన్నెరసాని
యేదిగులు లేక తెలివొందే చల్ల
సాదుతరగల గుములు చిందే మనిసిగా
నేదారినో చచ్చుటేగదా మరి యిందు
లేదు చావో తనకునైనా అనుకుంది
లేదు చావును మగనికైనా.

౯. కిన్నెర వైభవము

తూర్పులో తెల్లనై తోచిన దుషఃకాంత
తొలిమావిలేబూత దూసెను పికీకాంత
తలలపై రతనాలు తళతళా మెరిసేటి
నల్లత్రాచులు దూకి నాట్యమాడేటట్లు
మెరిసింది కిన్నెరా ఒడ్డుల్లు
ఒరిసింది కిన్నెరా

పొందమ్మి తెలివొంద పొడిచింది క్రొంబొద్దు
మేల్కొను మెకాలతో మెలగిన దడవిసద్దు
పసుపుబట్టలు ఆరపట్టగా నేలపై
గాలి లేబొరలలో కదలు లాడినయట్లు
కదలింది కిన్నెరా కాంతితో
మెదలింది కిన్నెరా

ప్రొద్దెక్కి గాలిలో పుట్టింది చిఱువెట్ట
పొదల బుర్రు మని కూసింది కోమటిపిట్ట
రేలచెట్టూ కెల్ల రాలి క్రొత్తచివుళ్ళు
తొడిగి లేయెండలత్రోవ దూకినయట్లు
పొలిచింది కిన్నెరా తెలుపుల్లు
మలచింది కిన్నెరా

జాము జామున్నర సాగెను చదల ప్రొద్దు
నెమలి కూతలతోడ నిండిన దడవి సద్దు
తరగ విరిగినచోట తరణికాంతులు ప్రబ్బి
గాజముక్కలు సూర్యకాంతి మండినయట్లు
పొదిలింది కిన్నెరా అందాలు
వదలింది కిన్నెరా

మిగులు తా నడిమింట మెరసి మండెను తరణి
నెగడె కాంతారమ్ము నిశ్శబ్ద మగు కరణి
మరకతమ్ములు నేల పరచగా పడ్డట్లు
పారుటాకుల మీద పసిమి యూదినయట్లు
నడచింది కిన్నెరా సొగసుల్లు
ముడిచింది కిన్నెరా

మూడుజాముల ప్రొద్దు మొగి జారినది మింట
వెనుకపట్టెను తమ్మివిరి మేల్వలపుపంట

కళ్ళమ్ముతుడిచి పండిన గోదుమల కుప్ప
తూర్పుగాలులకు తూర్పారపట్టినయట్లు
జారింది కిన్నెరా పైడిగా
మారింది కిన్నెరా

మూరగా బారగా ప్రొద్దు వాటారింది
పొలము పిచ్చిక గుంపు పురుగు మేతేరింది
అడవి చెట్టులనీడ లవఘళించిన నీరు
వలపు తిరిగిన పైరు నాట్యమాడిన యట్లు
తరలింది కిన్నెరా
ఉరలింది కిన్నెరా

కొండ దగ్గిరనగా క్రుంకింది మునిప్రొద్దు
మింటవచ్చెను పిట్టగముల రెక్కలసద్దు
అడవిలో బోయ వేటాడినట్టి మృగాల
తొడుసులం బడి నల్లతోగు వారినయట్లు
నడచింది కిన్నెరా రంగులు
ముడిచింది కిన్నెరా

నల్లగా రేచాన నడచింది తొలిజాము
గొల్లుగా బొబ్బలిడె క్రొల్వులుల్ పెనుదీము
దొడ్డదొర ముంగిళ్ళ తోరణాలుగ వ్రేలు
హరినీల మణుల కాంతులు ప్రబ్బినట్లుగా
మారింది కిన్నెరా ఊటలై
ఊరింది కిన్నెరా

నడిరేయి నల్లనై నాట్యమాడిన దడవి
విడివులుల్ మృగముల వెదకి చంపెను తడర
నీరు సాగునో యేమొ నీరు కన్పడరాక
తరగసవ్వడీమాత్ర గురుతుపట్టెడునట్లు
పోయింది కిన్నెరా నలుపులా
చేయింది కిన్నెరా

శుక్లపక్షము వచ్చె చూచుచుండగ మింట
శోభిల్లె చిన్నజాబిల్లి తారలజంట
తెచ్చి మణ్గులుగ ఛాదీవెండి కంసాలి
మూసలో కరగించి పోసినయట్లుగా
ఆడింది కిన్నెరా తళతళ
లాడింది కిన్నెరా

తలిరాకు తుద తక్కితారెను వసంతమ్ము
కోకిలోర్చెను నెమలికూతలకు పంతమ్ము
మగనిపే రెడబాటు పొగల సగమయిపోయి
బహు సన్నగిలిపోయి పాలిపోయిన మేన
మెరసింది కిన్నెరా ఎదలోన
ఒరిసింది కిన్నెరా

ఎడనీరు కాల్వలై యేరులై పోవుకై
వడి మృగమ్ములు దప్పికలు తీర్చుకొనురీతి
సాగింది కిన్నెరా బూదిరం
గూదింది కిన్నెరా

మండు టెండలు గాసి మాడ్చినది గ్రీష్మమ్ము
కొండయంచులనుండి కురిసినది ఊష్మమ్ము
నీటిపుట్టము తొలగి నిలువెల్ల నిప్పులో
యేటియిసకలు మండి యెగసిపడిపోవగా
ఏడ్చింది కిన్నెరా తనువెల్ల
మాడ్చింది కిన్నెరా

అడవిలో చిఱుపూట యట్లుగా కదలాడి
పాలలో కలిపిన పంచదారవిధాన
రుచి హెచ్చె కిన్నెరా సితమణి
చ్ఛవి గ్రుచ్చె కిన్నెరా

వడగళ్ళతో వచ్చిపడె వానకాలమ్ము
పుడమి పచ్చికలతో పొంగెను రసాలమ్ము
పతిగుట్ట మొగిలితోడున క్రుమ్మరించిన
అతి ప్రేమవారి దేహ మ్మెల్ల నిండగా
సుడిసింది కిన్నెరా అందాలు
తడసింది కిన్నెరా

నలగఁగొట్టిన పంగనామాల చెరుకులో
నలిబూదెరంగు పానకము జాలినయట్టు
వడిచింది కిన్నెరా నల్లనై
నడచింది కిన్నెరా

అంచెరెక్కలతోడ నరుగుదెంచె శరత్తు
పంచలందున తెల్పుపడె కొంచెము సరిత్తు
మొదలిపొంగులు పోయి పోనుపో స్వచ్ఛమై
తేరుకొన్న మనోహరుని ప్రేమపోలిక

కదిలింది కిన్నెరా కెరటాలు
మెదలింది కిన్నెరా

బంగారుతీగలో పానక మ్మయిపోయె
మఱియు చిక్కనగాక మఱియు పల్చనగాక
తరలింది కిన్నెరా పండ్లరం
గురలింది కిన్నెరా

దిశదిశల్ మంచులో తేలించుకొనె కారు
తెల్లనై తరగల్లు తేలించుకొనె నేఱు
రాణివాసము వొల్చు రమణి మేల్ముసుగులో
వెండితీగ వితాన వెలిగిపోయెడునట్లు
వెలిగింది కిన్నెరా దారిలో
మలగింది కిన్నెరా

శైవాభిషేకరంజన్నారికేళ గ
ర్భాంబువుల్ వాకలై అడవి పారినయట్లు
కదలింది కిన్నెరా ముత్యాలు
వదలింది కిన్నెరా

శిశిరాగమము పచ్చి చెట్లయాకులు దూసె
ముసలులై జంతువులు ముడుచుకొని కన్మూసె
పొలతి దేహమ్మెల్ల ముడుతల్లు పడ్డట్లు
పొలిచింది కిన్నెరా నిలుకడల్
వలచింది కిన్నెరా

రాలి యెండినయాకు లోలిండి నీరముల్
మాగి యెర్రని క్రొత్తమధువుకాలువ యట్లు
తోచింది కిన్నెరా యెర్రనై
యేచింది కిన్నెరా

ఋతువు ఋతువున మారు రుచులలో కిన్నెరా
కారుకారువ మారు కాంతిలో కిన్నెరా
తెలుగు సత్కవిరాజ పలుకందుకోలేని
ఛవులూరి చవులూరి జలమెల్ల ప్రొవులై
కదిలేను కిన్నెరా
సాగేను కిన్నెరా

తెలుగు దైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య అతని దర్శనము చేసే త్రోవ
కాచింది కిన్నెరా

తెలుగు యాత్రికుల కందిచ్చు చల్లని నీడ
పుణ్యాత్మ కిన్నెరా

తెలుగు యాత్రికుల కందిచ్చు చల్లని నీరు
పూతాత్మ కిన్నెరా

తెలుగు దైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య అతని దర్శనము చేసే త్రోవ
కాచింది కిన్నెరా

Author

విశ్వనాథ సత్యనారాయణ

(సెప్టెంబర్ 10, 1895 - అక్టోబరు 18, 1976)

విశ్వనాథ సత్యనారాయణ (సెప్టెంబర్ 10, 1895 - అక్టోబరు 18, 1976) "కవి సమ్రాట్" బిరుదాంకితుడు. తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. 20 వ శతాబ్దములోని ఆంధ్ర సాహిత్యమునకు, ప్రత్యేకించి సంప్రదాయ సాహిత్యమునకు పెద్ద దిక్కు. అతను చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు - కావ్యములు, కవితలు, నవలలు, నాటకములు, పద్యకావ్యములు, ప్రయోగములు, విమర్శలు, వ్యాసములు, కథలు, చరిత్రలు - అతను పాండిత్యము, ప్రతిభలు జగమెరిగినవి. అతను మాటలలోనే "నేను వ్రాసిన పద్యముల సంఖ్య , ప్రకటింపబడిన సంఖ్య, సుమారు ఇరువది వేలుండ వచ్చును. నేను చింపివేసినవి ఏబది వేలుండవచ్చును " అతను వ్రాసిన రచనలన్నీ కలిపితే లక్ష పుటలు ఉండవచ్చును. విశ్వనాథ మాట్లాడే వెన్నెముక అని శ్రీశ్రీ వర్ణించారు. జి.వి. సుబ్రహ్మణ్యం ఇలా చెప్పారు - "ఆధునికాంధ్ర జగత్తులో విశ్వనాథ ఒక విరాణ్మూర్తి. వచన కవిత్వం వినా అతను చేపట్టని సాహితీ ప్రక్రియ లేదు. పట్టింది బంగారం చేయని పట్టూ లేదు. గేయం వ్రాసినా, పద్యం రచించినా, ముక్తం వ్రాసినా, మహా కావ్యాన్ని రచించినా విశ్వనాథ కృతిలో అతనుదైన ఒక వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక వైలక్షణ్యం వెల్లివిరుస్తుంది. మహాకవిగా మనుగడ సాగించడానికి ఉండవలసిన మొదటి లక్షణం - ఈ వ్యక్తిత్వం."

గోదావరిలో కలిసిపోయే ఒక వాగు కిన్నెరసాని. కవి ఈ వాగును ఒక గొప్పంటి గృహిణిగా ఊహిస్తున్నాడు. ఆమెకు కూడా అత్తాకోడళ్ళపోట్లాట తప్పింది కాదు. భర్త మీద ప్రేమను ఒదులుకోక అత్తమీద పెత్తనం చలాయించలేక ఏమీ చేయలేని ప్రియుడ్ని వదలి కోపంతో కిన్నెర అడవుల వెంట పరుగెడుతుంది. తన ప్రియురాల్ని వెదుకుతూ తుదకు ప్రేమతాపంతో ఇద్దరూ కలుసుకొని ఒకరి ఎడబాటును ఇంకొకరు సహించలేకపోతారు. అపుడు అతను శోకించి శోకించి ఆమెను విడిచి కొండగా (రాయి)మారతాడు. ఆ సమయంలో కిన్నెరసాని తొడిమలేని పువ్వులా, మిక్కిలి సిగ్గుగల రాచకన్నెలా, కాంతిలేని రత్నంలా నడుస్తుంది. రాయిలా పడివున్న భర్తను విడువలేక సాగుతుంది కిన్నెరసాని వగపు తీగలా తిరుగుతుంది. తాను కూడా రాయిని కాలేక నదిని అయినందుకు లోలోపల దిగులు చెందుతుంది. విషాద గీతికల్లా శబ్దం చేస్తూ నడుస్తుంది. ఒకచోట నిలబడలేక అటుఇటు ఉరుకుతుంది. పోనీ తిరిగి కిన్నెరసానిగా ప్రవహించ వలెనని భావిస్తుంది. ఆ కోరిక ఆవహించగా తనను విడిచి భర్త ఉండలేడని, ఇక చెలిమి లేదని తలపోస్తుంది. అటువంటి భర్తతో కాపురం లేనందుకు వగస్తుంది, ఏడుస్తుంది కిన్నెరసాని. జలదేవతలు వచ్చి కిన్నెరసానిని పదమని బలవంత పెట్టగా పతిని వదలలేక వదలలేక కదలిపోతుంది. కిన్నెరసానిని చూచి కడలిరాజు మోహించి ఉప్పొంగుతాడు. కిన్నెరసాని తను తొందరపాటును, తెలివితక్కువ తనాన్ని తలచుకుని భోరున విలపిస్తుంది. ఆమె ఏడుపును చూసి అడవిలోని ఎలుగులు, పులుగులు, మృగములు,

గాలులు రోదిస్తాయి. ఈ వార్త విని గోదావరి కరిగిపోయి తన కెరటాలను చాచి కిన్నెరసానిని ఆదుకుని కడలిరాజు నీ జోలికి రాడు అని అభయమిస్తుంది. గోదావరీనది ఆశ్రయంలో కిన్నెరసాని తిరిగి తన వైభవాన్ని సంతరించుకుంటుంది.